క్లుప్తంగా

జగనన్న కాలనీల పరిశీలన



పాములపాడు(తాడికొండ): జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తాడికొండ మండల ఎంపీడీఓ అత్తోట దీప్తి సూచించారు. మంగళవారం తాడికొండ మండలం రావెల, పాములపాడు, బేజాత్పురం గ్రామాల్లోని జగనన్న కాలనీ లే అవుట్‌లను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. సత్వరమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బేజాత్పురం లే అవుట్‌లో నిర్మాణాలకు నీటి సమస్య ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వెంటనే బోరు వేయించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



ఫిరంగిపురం: హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పోతురాజు వివరాలు వెల్లడించారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో పదో తేదీ రాత్రి అన్నదమ్ముల మధ్య స్థల వివాదంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. దాడికి పాల్పడిన నాగేశ్వరరావు, శ్రీకాంత్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు వివరించారు. కేసు దర్యాప్తులో వేగవంతంగా పనిచేసి నిందితుల అరెస్టు చేసిన మేడికొండూరు సీఐ వాసు, ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి, సిబ్బందిని అభినందించారు.

జగనన్న విద్యాకానుక కిట్లు అందజేత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను మంగళవారం అందజేశారు. ముఖ్య అతిథులుగా దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నం ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు- నేడులో భాగంగా పాఠశాలలను తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో కోటి యాదవ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగెశెట్టి దుర్గ పాల్గొన్నారు.

గుండిమెడ ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలి



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని గుండిమెడ ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. మంగళవారం గుండిమెడలో సీపీఎం నాయకులతో కలసి ఏఈ బొమ్మిరెడ్డి కిషోర్ రెడ్డిని కలిశారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా గ్రామంలో తాగునీరు సరఫరా సక్రమంగా లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఏఈ 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు రూ.20 లక్షలతో సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లె కృష్ణ, బత్తుల సంసోను తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారుల్లో చురుకుదనం

నెహ్రూనగర్: వ్యాయామాలు, ఇతర యాక్టివిటీస్ ద్వారా చిన్నారులు చురుగ్గా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణవేణి, సూపర్‌వైజర్ తబిత తెలియజేశారు. గుంటూరు అర్బన్ ఈస్ట్ 1 సెక్టార్ మణిపురం, ఇశ్రాయేల్‌పేటలోని అంగ్‌వాడీ కేంద్రంలో జన్‌బాగీదారీ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు, తల్లిదండ్రులకు పోషణ, నైపుణ్యతపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మా ట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కువగా వివిధ యాక్టివిటీస్ వైపు మొగ్గు చూపేలా చూడాలన్నారు. తద్వారా వారు చురుగ్గా ఉంటా రన్నారు. అదేవిధంగా జన్‌భాగిధరి కార్యక్రమంలో భాగంగా ఈస్ట్ 2 సెక్టార్ పరిధిలోని తిమ్మ య్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నీలిమ తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం పెట్టడం ద్వారా పుష్టిగా ఉంటారన్నారు.



ప్రమాదం తప్పింది. మినీ ట్రక్కులో తీసుకెళ్తున్న ఇనుప చువ్వలు జారిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఒక్కసారిగా లారీ నుంచి చువ్వలు రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఆ వాహనం వెనక వస్తున్న వాహనచోదకులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.

–మంగళగిరి

పట్టు తప్పింది..



మిర్చి లోడు లారీ పట్టుతప్పింది. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో చోటుచేసుకుంది. నంద్యాల నుంచి గుంటూరు మిర్చిలోడుతో లారీ వస్తోంది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి.

–ఫిరంగిపురం

పట్టాలు ఇచ్చిన వారందరికీ ఇళ్లు కట్టిస్తాం

- వైఎస్సార్ జయంతికి శంకుస్థాపన
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి నగర పరిధిలో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. మంగళగిరి నగరంలోని అల్పా హోటల్ ఎదుట నూతనంగా నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణంతో పాటు ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వెనుక నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులు మంగళవారం పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఐ వెనుక రూ.2 కోట్లతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నగర పరిధిలోని 23 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించడం జరిగిందని వారందరికి జూలై 8వ తేదీ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి గృహప్రవేశాలు చేసేలా పనులు చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా కార్యదర్శి దాసరి వీరయ్య, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



తెనాలి ఫ్లై ఓవర్ పక్కన రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

మంగళగిరి: తెనాలి ఫ్లైఓవర్ పక్కన నిర్మిస్తున్న రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అధికారులకు సూచించారు. నగరంలోని తెనాలి ఫ్లై ఓవర్‌కి ఇరువైపులా రూ.కోటితో చేపట్టిన విస్తరణ పనులతో పాటు ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద ఉన్న తాగునీటి పథకం ఆవరణలో నిర్మాణంలో తుది దశకు చేరుకున్న స్కేటింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- మంగళగిరిపాడు సచివాలయ భవనం ప్రారంభం

మేడికొండూరు: ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా తెలిపారు. మండల పరిధిలోని మంగళగిరిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం అమలు ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చినట్లు చెప్పారు. తద్వారా అన్ని సేవలు ఇంటి వద్దేకు అందుతున్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వాలు చేయని పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందని చెప్పారు. సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందాలనే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమం వదిలేసి, అధికార దాహంతో ప్రతిపక్షాలు చేప్పే మాటలు నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. తొలుత సర్పంచి షేక్ రబ్బానిఆధ్వర్యంలో అతిథులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, వైస్ ఎంపీపీలు భవనం రాజశేఖరరెడ్డి, అవుల సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, డోకిపర్రు సర్పంచి కొండెపోగు సాంబ్రాజ్యం,కొర్రపాడు సర్పంచి నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తూమాటి మురళి, వాడపర్తి భారతి, జేఏసీ కన్వీనర్ అబ్బాస్, మైనారిటీ సెల్ నాయకులు షేక్ షరీఫ్ పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న హెనీక్రిస్టినా, కత్తెర సురేష్ కుమార్

అంగన్‌వాడీపై అవగాహన అవసరం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ వేణుకుమారి మాట్లాడుతూ జన భాగీధారి కార్యక్రమంలో భాగంగా 6 సంవత్సరాలలోపు పిల్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు సూచించారు. ప్రీ స్కూల్‌కు పిల్లలను పంపడం ద్వారా వారు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారని వివరించామని అన్నారు. కార్యక్రమంలో శకుంతల, అంగన్‌వాడీ వర్కర్లు సుజాత, విక్టోరియా రాణి పాల్గొన్నారు.

బాల్యదశ ఎంతో విలువైనది

ఫిరంగిపురం: పిల్లల జీవితాలలో మొదట బా ల్యదశ ఎంతో విలువైనదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత అన్నారు. మండల కేంద్రంలోని 14వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం జన భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్యదశలో కలిగించే ప్రేరణలే మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయని చెప్పారు. అనంతరం చిన్నారుల గ్రాడ్యుయేషన్, బాల్యవివాహాల నివారణ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు.



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వేణుకుమారి



ఫిరంగిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు

స్మార్ట్ క్లాస్‌రూమ్, డిజిటల్ బోర్డ్ అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం రామకృష్ణ మిషన్ స్కూల్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలకు స్మార్ట్‌క్లాస్ రూమ్‌ను బహూకరించారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌నురోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పేద, మధ్య తరగతి ప్రజల విద్యార్థులు చదువుతున్న రామకృష్ణ మిషన్ స్కూల్లో చదువుకోవడానికి వీలుగా ఓ డిజిటల్ బోర్డును ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ రోజురోజుకి పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల నైపుణ్యం పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ క్లాస్‌రూమ్ బహూకరించినట్లు చెప్పారు. అదే విధంగా ఓ డిజిటల్ బోర్డును కూడా అందజేయడం జరిగిందని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ డేర్ ప్రాజెక్ట్ చైర్మన్ త్రిపురనేని మురళి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి వారు సంప్రదించగా తమ క్లబ్ తరుపున వెంటనే డేర్ ప్రాజెక్ట్ కింద అప్రూవల్ తీసుకుని 15 రోజుల్లో ప్రాజెక్ట్ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ తాడేపల్లి కోశాధికారి శెట్టి రామకృష్ణ, సభ్యులు పరుచూరి కిరణ్, చంద్ర ఓబులారెడ్డి, జె. ప్రభాకర్‌రెడ్డి, సుకుమార్ రెడ్డి, రాచర్ల శ్రీనివాసరావు, శంకర్ శెట్టి, రమేష్, బసివిరెడ్డి, గోపాలం, శివ పాల్గొన్నారు.



స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి తదితరులు

మెకానిక్‌ల సమస్యకు త్వరలో పరిష్కారం

చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో ఆటోనగర్ లేకపోవడంతో జీబీసీ రోడ్డుపక్క, రోడ్లపై మెకానిక్ పనులు చేసుకుంటూ మెకానిక్‌లు అవస్థలు పడుతున్నారని వారి సమస్యలను త్వరలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరిష్కరించనున్నట్లు పొన్నూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అకుల వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీ భవనం పద్మలీల బొద్దులూరి రంగారావు, యందేటి వెంకటసుబ్బయ్య, మల్లెల రాజు, ఎం.అనీల కుమారి, కొల్లూరు శ్రీనివాసరావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు కుట్రలు పన్నుతూ అడ్డుపడుతూ ఆటంకాలు కలిగిస్తున్నారని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం స్థానిక భావన్నారాయణస్వామి దేవస్థానం భూములను లీజు ప్రాతిపదికపై తీసుకొని మెకానిక్‌లకు ఆటోనగర్ నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఓ ప్లాంట్లు

మంగళగిరి: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సందర్శకులకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడం అభినందనీయమని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంగళగిరి చైర్మన్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి చార్టర్ ప్రెసిడెంట్ ఇసునూరి అనిల్ చక్రవర్తి రూ.80 వేల ఆర్థిక సాయంతో ప్లాంట్‌ను బహూకరించార. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ రీజనల్ ట్రైనర్ పీవీ సత్యనారాయణ ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మంగళగిరి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు త్రిపురమల్లు సతీష్, షేక్ సలార్, గాజుల శ్రీనివాసరావు, పారేపల్లి నిరంజన్ గుప్తా, జొన్నాదుల భిక్షాలరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, తాడికొండ ప్రకాష్ పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, దాత అనిల్ చక్రవర్తి

యువకుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరుకు చెందిన ఓ యువకుడు కొండూరు అవినాష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన సాయాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. రూ.20వేలు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో పెదకొండూరు ఎంపీటీసీ కొండూరు సుమన్, పేరికలపూడి సర్పంచి గంపల గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జాన్సన్, నల్లగొర్ల కోటి యాదవ్, కర్ర్యూరావు పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణపై అవగాహన

మంగళగిరి: ప్రభుత్వ స్థలాలలో స్థిర నివాసం ఏర్పరచుకుని నివాసముంటున్న వారి స్థలాలు క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మహత్తర అవకాశం కల్పించిందని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్థలాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ కార్యదర్శులు, వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వంద గజాలలోపు స్థలాలకు ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరించి డి పట్టా అందజేస్తుందని చెప్పారు. 100 గజాల నుంచి 500 గజాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం నుంచి స్థలాలు, గృహాలు పొందిన వారు క్రమబద్ధీకరణకు అనర్హులని చెప్పారు. క్రమబద్ధీకరణకు వచ్చే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు నియమ నిబంధలను వివరించాలన్నారు.

నగదు గోల్‌మాల్ ఘటనలో ఇద్దరి అరెస్ట్

పట్నంబజారు: సెల్‌ఫోన్ షాపులో నగదు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సంగీత మొబైల్‌షాపులో గత కొద్దిరోజుల క్రితం అకౌంట్ విభాగం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈనేపథ్యంలో రూ. 4 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు కనబడకపోవడంతో పాటు, నగదును మేనేజర్ అప్సర్‌బాషా, క్యాషియర్ ఫిరోజ్ దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈమేరకు సంగీత మొబైల్ షోరూమ్స్ జిల్లా ఇన్‌చార్జి రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

మద్యం మత్తులో ఆటోడ్రైవర్ హల్‌చల్

పట్నంబజారు: పూటుగా మద్యం సేవించి ఆటో డ్రైవర్ హల్‌చల్ చేసిన సంఘటనపై కేసు నమోదైంది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేమూలూరుపాడుకు చెందిన సయ్యద్ సాధిక్ తన ఆటోలో గుంటూరు మంగళవారం బాడుగ నిమిత్తం వచ్చాడు. శారదా కాలనీలో పూటుగా మద్యం సేవించి ఇష్టానుసారంగా ఆటో నడుపుతూ కొత్తపేట శివాలయం వద్ద ఇరువురు మహిళలను ఢీకొట్టాడు. ప్రమాదంలో మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంతో భయానక వాతావరణం నెలకొంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకుల అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద సింగిల్‌నంబరు లాటరీ ఆడిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6,810లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యక్ష నరకం.. పార్శ్వపు నొప్పి తీవ్రం

యువతను వేధిస్తున్న మైగ్రేన్

- విపరీత ఆలోచనలు, నిద్రలేమి, 'స్మార్ట్' బానిసత్వమే కారణాలు
- ముందస్తు జాగ్రత్తలతో మైగ్రేన్ తలనొప్పిని కట్టడి చేయవచ్చు
- జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం
- జూన్ నెల మైగ్రేన్ అవగాహన మాసం

గుంటూరు మెడికల్: మైగ్రేన్ .... సోకిందంటే ఓ పట్టాన వదిలిపోదు. యుక్తవయస్సులోనే అనేక మంది మైగ్రేన్ బారిన పడుతున్నారు. ఆధునిక జీవనశైలి వల్ల నేడు చిన్న వయస్సులోనే ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం తీవ్రమైన తలనొప్పి సమస్యతో బాధపడుతున్నారు. తలనొప్పితో ఏ పనిచేయలేక తమ రోజువారీ పనులు సైతం చేసుకోలేక పలువురు అల్లాడిపోతున్నారు. జూన్ నెల నేషనల్ మైగ్రేన్ అండ్ హెడ్‌ఏక్ అవగాహన మాసం సందర్భంగా తలనొప్పి, మైగ్రేన్ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

యువతలోనే అధికశాతం...

ఆధునిక జీవనశైలిలో యువతే ఎక్కువగా మైగ్రేన్ బారిన పడుతున్నారని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ఎక్కువగా 20 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు మైగ్రేన్ బారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తున్న వారు అధికంగా మానసిక ఒత్తిడికి గురవుతూ మైగ్రేన్ బారిన పడుతున్నారు. ఉద్యోగాలు, చదువులో పోటీ తత్వం ఏర్పడి ర్యాంకులు సాధించేందుకు ఒత్తిడికి గురవ్వటం వల్ల తలనొప్పి వస్తుంది. నిద్రలేమి, విచ్చలవిడిగా కంప్యూటర్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు వినియోగిస్తూ కంటికి సరిపడా నిద్రపోకుండా ఉండటం వల్ల మైగ్రేన్ బారిన పడుతున్నారు.

గుంటూరు విద్యానగర్‌కు చెందిన సునీత కొద్దిరోజులుగా తలనొప్పి వల్ల కాలేజీకు వెళ్లలేక ఇంట్లోనే ఉండి పోతుంది. తల్లిదండ్రులు ఆమెను వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా మైగ్రేన్ తొలనొప్పితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. విద్యార్థిని స్మార్ట్‌ఫోన్‌లో అర్ధరాత్రిళ్లు వరకు ఆన్‌లైన్ చాటింగ్‌లు చేస్తూ నిద్ర సక్రమంగా పోకుండా ఉండటం వల్ల ఈ వ్యాధికి గురైనట్లు నిర్ధారణ చేశారు.



బాధితుల వివరాలు...

జిల్లాలో 60 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉండగా ఒక్కో వైద్యుడి వద్దకు ఐదుగురు బాధి తులు తలనొప్పితో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో వారంలో మూడురోజులపాటు న్యూరాలజీ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్నా రు. ఒక్కోరోజు 300లకు పైగా వివిధ రకాల సమస్యలతో బాధితులు చికిత్స కోసం వస్తుండగా, వారి లో పది మంది వరకు మైగ్రేన్ బాధితులు ఉంటున్నారు.

నల్లపాడుకు చెందిన విజయలక్ష్మి అనే గృహి జీ ఇంట్లో పనులు ఏమీ చేయకుండా తలనొప్పి వల్ల మంచానికే పరిమిత మవుతూ ఉండటంతో కుటుంబ సభ్యులు వైద్యు ల వద్దకు తీసుకెళ్లగా మైగ్రేన్ తలనొప్పి అని నిర్ధారణ చేశారు. వ్యసనాలకు బానిసైన భర్త ఇంట్లో పట్టించుకోకుండా ఇష్టా నుసారంగా ప్రవర్తిస్తూ ఉండటంతో ఆమె లో విపరీతమైన ఆలోచనలు పెరిగిపోయి మైగ్రేన్ తలనొప్పి వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

కారణాలు...

మైగ్రేన్ తలనొప్పి వచ్చిన వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి(పార్శ్వపు నొప్పి) చాలా వరకు తలకు ఒక పక్క మాత్రమే వస్తుంది. తలలో రక్తనాళాలు ఒత్తిడికి గురై వాయటం వల్ల వస్తుంది. కొన్ని సార్లు తలలో రెండు వైపులా ఈ నొప్పి వస్తుంది. తలలో కొట్టుకుంటున్నట్లుగా, నొప్పి వస్తూ పోతూ ఉన్నట్లుగా, తగ్గుతూ ... తీవ్రమవుతూ ఉన్నట్లుగా మైగ్రేన్ ఉంటుంది. కొందరికి వాంతులు అవుతాయి. మానసిక ఆందోళన, ఒత్తిడికి గురవ్వటం, అనవసరపు ఆలోచనలు, జరిగిపోయిన విషయాలను తరచుగా ఆలోచించటం వల్ల తలనొప్పి వస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగినా, ప్రయాణాలు ఎక్కువ చేసినా, భోజనం చేయటం ఆలస్యమైనా, అసలు భోజనం చేయకపోయినా, నిద్ర తక్కువైనా, ఎక్కువైనా తలనొప్పి రావొచ్చు. స్త్రీలలో హార్మోన్ల సమస్యలు ఏర్పడినప్పుడు, రుతుక్రమం ముందుగాని, తర్వాత గాని వచ్చే అవకాశం ఉంది. మగవాళ్ల కంటే స్త్రీలలో పార్శ్వపు నొప్పి బాధితులు ఎక్కువ.

లక్షణాలు...

పార్శ్వపు నొప్పి వచ్చిన మొదటి దశలో చిరాకు, మానసిక ఆందోళన, డిప్రెషన్, ఆలోచనల్లో మార్పు రావటం, వాసన, వెలుతురు పడకపోవటం, మెడనొప్పి ఉంటాయి. రెండో దశలో చూపు మందగించటం, జిగ్‌జాగ్‌లైన్స్ కనిపించటం, తలలో సూదులు గుచ్చిన భావన కలుగుతుంది. మాటలు తడబడటం, కాళ్లల్లో నీరసం ఉంటాయి. మూడోదశలో తలనొప్పి రెండు గంటల నుంచి మూడు రోజులపాటు ఉండొచ్చు. వాంతులు ఉంటాయి. నొప్పి ఒక వైపు ఉంటుంది. కాంతిని చూసినా, శబ్దాలు విన్నా చికాకు పుడు తుంది. నాల్గోదశలో తలనొప్పి తగ్గిన తర్వాత కొద్ది రోజుల వరకు తల భారంగా అనిపిస్తుంది. ఒళ్లంతా నీరసంగా, నిరాసక్తంగా అనిపిస్తుంది.

జీజీహెచ్‌లో కార్పొరేట్ వైద్యం..

గుంటూరు జీజీహెచ్‌లో మంగళవారం, గురువారం, శనివారం మైగ్రేన్ బాధితులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలను అందిస్తున్నాం. వివిధ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. మైగ్రేన్‌ను నియంత్రణలో పెట్టడం ద్వారా కొన్నాళ్లకు అదే తగ్గిపోతుంది. కాని మరలా కొంత కాలం తర్వాత తిరిగి రావచ్చు. నెలకు రెండుసార్లు కంటే ఎక్కువగా తలనొప్పి వస్తున్నా, ఒక్కసారే వచ్చి ఎక్కువసేపు నొప్పి ఉంటున్నా ప్రత్యేక మందులు తీసుకోవాలి.

– డాక్టర్ ఎస్.వెంకటసుందరాచారి, న్యూరాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్